# బారతం బొమ్మలు

గోపిని కరుణాకర్

(గతవారం తరువాయి)

అరాత్తిరి మంచు వాన కురిసినట్టు కురిసింది. ఎద్దులు ముందుకు అడుగెయ్యలేకపోయినాయి. దావ జరగలేదు. అక్కదేవతల గెవిలో తలదాచుకొంటిమి. ఎవరో పులి, సుత్తి ఎత్తుకొని తొర్ర చేసినట్టుందాది గెవి. ఆ గెవిలో అక్కదేవతలు కొలువుంటారు.

గెవి ముందర పెద్ద యాప చెట్టు, చెట్టు కింద నిలువెత్తు పాముపుట్ట దొంతులు దొంతులుగా పెరుగుండాది. ఎద్దులు తడిసిన వరిగడ్డిని మూగినూడలేదు. పడుకొని నెమరేసుకొంటా వుండాయి. అలికిడికి బెదిరి ఉడతలు కొమ్మల మింద సరసరా పరిగెత్తుకొంటా, ఎగిరి కిందకు దుంకి పొదల్లో మాయమైనాయి.

ఎక్కడ్నో కొండ మింద నుంచి దెమదెమా జరిదూకే మోరుపు ఇనిపిస్తా వుండాది.

నలికి దొరసాని పాణం కిందమిందా అయిపోయింది. మంటేసుకొందామంటే చిదుగులు మంచుకు ముద్దగా తడిసిపోయినాయి. అరికాళ్లు. అరిచేతులు రుద్ది ఎచ్చజేసినాను. సుగంలేదు. ఎట్లయినా మంటేసుకోవాల్సిందే. లేకపోతే దొరసాని పాణం పోవడం కాయం.

బారతం బొమ్మలు మంటేసు కొందామని తీరుమానం చేసుకొంటి. మూటలు ఇప్పి బొమ్మల్ని బయటకు తీసినాను. బొమ్మలకు కప్పినవరిగడ్డి తడవలేదు. రెండు కనికిరాళ్లు తీసుకొని నిప్పురాజేసినాను. వరిగడ్డి రగులుకొనింది. ద్రౌపతమ్మ బొమ్మను మంటల్లో ఎసినాను. లక్కపూత భగ్గుమని అంటుకొనింది.

మంట తగిలే గుండికే పాణాలు లేసొచ్చినాయి. దొరసానైతే మంటను అబ్బీలించుకొనింది. ఎలతరగెవంతా పడింది. అక్కదేవతల శిలలుకు ఎప్పుడో పూసిన పసుపు కుంకాలు ఎండి రాలిపోయుండాయి. గెవిలో అందనంత ఎత్తున తేనెతుట్టె ఒగటి ఏలాడతావుండాది. తేనెటీగలు జుమ్మని ముసురుకొని వుండాయి.

చలికాంచుకొంటా దొరసాని అక్కదేవతల శిలల్ని చూసింది. ఆమె వొల్లు జల్లుమనింది.

వున్నెట్టుండి 'పెళపెళా' వుడుమురిమి పక్కలో పిడుగు పన్నెట్టు పేటుమింద నుండి రాళ్లు దొర్లినాయి. గుండెకాయలు దడదడా అదిరినాయి. పాణాలు సల్లబడినాయి. దొరసాని వులిక్కిపడి బిత్తర చూపులు చూస్తా నన్ను అబ్బీలించుకొనింది.

రోమాలు నిక్కబొడుచుకొన్నేయి.

గప్పుడు గప్పుడని గిట్టల శెబ్దం. బీతి నుండి తేరుకొని మొనుసులోనే నవ్వుకొన్నేను. దొరసాని సన్నగా వణకతావుండాది. గుండె దడ తగ్గనే లేదు.

"జింకల మంద బెదిరినట్టుండాది. జింకలు బెదిరితే రాళ్లు రప్పలు పిండి అవ్వాల్సిందే" అన్నేను.

గప్పుడు గప్పుడని గిట్టల శెబ్దం గుండెల మింద నుంచి దూరమైంది. బీతి నుండి తేరుకొనింది. అయినా నన్ను వదల్లేదు.

"మంటకంటే నీ వొళ్లు ఇంగా ఎచ్చంగా వుండాది" అనింది.

తలపైకెత్తి నన్ను చూసింది. దొరసాని కండ్లల్లో దగదగా ద్రౌపతి బొమ్మ మంటలు.

"మాదిగోడ్ని ముట్టుకొంటే మకాపాతకాలు అంటుకొంటాయి" అన్నేను.

"అంటుకోనీలే నరకానికి పోతాను" అనింది.

విడుపించుకొని దూరంగా పొయ్యి నిలబడుకొన్నేను. కొండకొనల్లో నిరుశెబ్దంగా మంచు, ఎన్నెల కలిసి కురస్తావుండాయి. కొండమింద నుంచి దెమదెమా జరిదూకే మోరుపు. అర్దరాత్తిరి అడివిలో మేమిద్దరమే. అలికిడిలేని అడివిని చూస్తావుంటే బయంగా వుండాది.

వున్నెట్టుండి తెల్లారిపోతే బాగుండనిపించింది.

ఎనకనే వొచ్చి ఈపు మింద గెడ్డాన్ని ఆనించి చేతులతో చుట్టేసింది. మెడను వూపిరి కాల్చేస్తా వుండాది. రొమ్ముల ఎచ్చదనం కలగలిసిన ఆడ వాసన మత్తుగా మైకం కమ్మినట్టుండాది. తట్టుకోలేకపోయినాను. గబుక్కున తిరగి దొరసాని కావిలించుకొన్నేను.

పూలను తీసుకొన్నెట్టు చెంపల్ని చేతుల్లోకి తీసుకొనింది. నన్ను కండ్లనిండా నింపుకొనింది.


"నాకు చుక్కలాకాశాన్ని తెంపిస్తావా?" ఆశగా అడిగింది.

నేనేమి చెప్పకుండా గొమ్మనుండిపోయినాను.

"చిన్నప్పుడు మా నాయనవ్వ వొడిలో పొనుకొని చుక్కలాకాశాన్ని తీసిమ్మని అడిగినాను"

"ఇంగ కొన్ని దినాలు పోతే మీ నాయన ఆకాశమంత పందిలేసి, నిన్ను ఒగ రాజ కుమారుడి చేతిలో పెడతాడు. నీ రాజకుమారుడ్ని అడుగు తీసిస్తాడు. నన్ను అడిగితే నేనెట్టా తీసిచ్చేది ముసలిదాన్ని" అనింది నవ్వతా-

నన్నొదిలి మంట దెగ్గిరికి పొయ్యి కుచ్చొనింది. దర్మరాజుల బొమ్మను మంటల్లోకి ఇసిరాను. 'చిటపటా' మినగర్లు పైకి లేసినాయి.



"రాజకుమారుడు చుక్కలకాశాన్ని తీసిచ్చినాడా?" దెగ్గిరికిపోయి అడిగినాను.

లేదని అడ్డంగా తలవూపింది. చింత గింజలు రాలినట్టు పలపలా కండ్లనీళ్లు రాలినాయి. కంటినీరు తుడిసి వొళ్లోకి తీసుకొన్నేను.

"నువ్వు తీసిస్తావా?" మెడ సుట్టూ చేతులేసి వంచింది.

బుగ్గల్ని దోసిట్లో అదుముకొని నుదిటి మింద ముద్దు పెట్టుకొన్నేను. వొళ్లంతా పులకింత. పువ్వులో సనసన్నని వొణుకు.

"అబ్బా! నీ ఎద ఎంత ఎత్తుండాది. వురులు తిరిగి కండల్ని చూస్తావుంటే పిచ్చెక్కతావుండాది" ఎదను మునిపంటితో కొరికింది.

చేతులతో వొళ్లంతా తడిమింది. వొంటిని కొండచిలవ పాము సుట్టుకొనింది.

ఆకాశంలో వొంటరి కొంగవాగటి అడివిని ఈదతావుండాది. ఆడాడ మబ్బులు నిద్దరమైకంలో తూగతావుండాయి. యాపచెట్టు కొమ్మల్లో తొంగితొంగి చూస్తా వొంకిరి చెందమామ.

చుక్కలాకాశాన్ని తెంపి దోసిట్లో పోసినాను. బారతం బొమ్మలు కాలి బూడిదైనాయి.

తూరుపున పటమెగరక ముందే బాకరపేటకు చేరినాం. అని కత చెప్పడం ముగించినాడు ముసిలోడు.

"మల్ల ఆ దొరసాని ఏమైంది తాత?" అడిగినాడు మనవడు.

"తెల్లారితే ఏముందాది. ఆమె దొరసాని, నేను మాదిగోడ్ని. ఎవురి దారి వాళ్లది. బండిదిగి పొయ్యేటప్పుడు ఒగసారి తిరిగి చూసింది. కండ్లనిండుకు నిళ్లవుండాయి.

ఒగ ఎరికల సానికి దొరసాని ఆనవాళ్లు చెప్పి ఈ పచ్చబొట్టు పొడిపించుకొంటిని అని చెప్పినాడు.

"మల్లెప్పుడూ ఆ దొరసానిని నువ్వు చూల్లేదా తాత?" మనవడు అడిగినాడు.

"రెడ్డికి అడివిలో జరిగిందంతా చెప్పలేదు. అడివిలో వాన కురిసినట్టు మంచుకురిస్తే, బారతం బొమ్మల్ని మంటేసుకొని పాణాలు కాపాడుకొన్నేనని చెప్పినాను."

"వూరు వొదిలిపొమ్మని శిచ్చ ఏసినాడు. మాయమ్మను పిలుసుకొని, దేవుని మింద బారమేసి ఈ గుత్తి రాజ్జానికి వచ్చేసినాను. మల్లనేను ఆ పక్కకే పోలదు. దొరసాని ఏమైందో ఏమో నాకు తెలవదు" అని చెప్పినాడు.

** ** **

వాన ఎలిసింది. గొడ్లు మర్రిచెట్టు కింద నుండి కదలబారినాయి. తాతమనవడు గుడ్డలు ఇదిలించుకొని పైకి లేసినారు. రెక్కల్ని రెపరెపలాడించినాను. మనవడు నన్ను చూసినాడు. చేతుల్లోకి తీసుకొని తాతకు చూపించినాడు.

"అరరే చిలకరెక్కకు దెబ్బతగిలిందే" అంటూ నన్ను తీసుకొని నెత్తురు తుడిసి, ఏవో ఆకుల పసురు పిండి రెక్కకు కట్టు కట్టినాడు.

"నొప్పిగా వుండాదా బుజ్జీ? తాత కట్టుకట్టినాడు గదా తగ్గిపోతుందిలే" నన్ను వొళ్లోకి తీసుకొని ముద్దు పెట్టుకొన్నాడు మనవడు.

కొంచేపటికి చేత్తో తీసేసినట్టు నొప్పి తగ్గింది.

పొద్దు గూట్లో పడింది. గొడ్లను కమ్మనాయుడి దొడ్లో తోలేసి మాదిగ పల్లెకు చేరినాం. మేము ఇంటికి పొయ్యేగుందికే పొయిమింద కుతకుతా గొడ్డు తునకలు వుడకతావుండాయి. వాసన గమగమా ముక్కుల్ని తాకింది.

ఆ పొద్దు మద్దేన్నం కొమ్ములు తిరిగిన ముసిలెద్దు ఒగటి సచ్చి పూడిసింది. ఇంగేముండాది మాదిగ పల్లెలో పండగే గదా! పెద్దబాగం ముసిలోడు వాళ్లదే. గుల్లడు తునకలు ఇచ్చినారు. పచ్చితునకలకు పసుపుపూసి గోగునారాకు కూర్చి దండేనికి ఏలాడదీసి వుండారు. తడికిల మింద పేగుల్ని ఆరేసినారు. ఇల్లంతా పచ్చి తునకల మదపోసన కొడతావుండాది.

నా కోసరమని వోటు కుండలో వరిగడ్డి పరిసి గూడు అల్లినాడు మనవడు. మెత్తని మేపులన్నీ తెచ్చిపెట్టినాడు. రోజూ పుండుతుడిసి కట్టుమార్చేవోడు. నన్ను ఎంతో ముదిగారంగా చూసుకొన్నేడు. వారం దినాలకు రెక్కాడించగలిగినాను. అప్పుడే కాకితో సావాసమైంది.

అవి మాదిగిండ్లు గదా! దండెం మింద ఏలాడదీసిన కండల కోసరం ఒగకాకి వస్తాపోతా వున్నింది. తొట్టతొలి చూపు చూపు కలిసింది. తర్వాత మాటమాట కలిసింది. మల్లే ముండాది ముక్కలదాక ప్రేమలో పడిపోయినాం.

మేమిద్దరం ప్రేమించుకొంటావుండామని తెలిసి నన్ను వదిలెయ్యమని ముసిలోడు మనవడికి చెప్పినాడు. వొళ్లంతా ముద్దు పెట్టుకొని నన్ను వదిలేసినాడు. నాకు దుక్కమొచ్చింది. ముసిలోడు, ముసిలోడి కొడుకు, కోడాలు, మనవడు వాళ్ల కుటుంబమంతా నన్నెంతో అబ్బురంగా చూసుకొన్నేరు. వాళ్లను జన్మజన్మలకు మరిసిపోలేను.

వాళ్ల దెగ్గిర సెలవు తీసుకొని కాకి, నేను యలబారి వచ్చేసినాం. పెంచల కోనలో కాపరం పెట్టినాం. ఒకర్ని ఇడిసి ఒకరు గడిసేపు వుండేవాళ్లంగాదు. పొద్దుపుట్టేది, పొద్దుగూకేది తెలిసేదిగాదు. కాకి చెంత సొర్గసుఖాలను అనుబోగించినాను.

> **మేమిద్దరం ప్రేమించుకొంటావుండామని తెలిసి నన్ను వదిలెయ్యమని ముసిలోడు మనవడికి చెప్పినాడు. వొళ్లంతా ముద్దు పెట్టుకొని నన్ను వదిలేసినాడు. నాకు దుక్కమొచ్చింది. ముసిలోడు, ముసిలోడి కొడుకు, కోడాలు, మనవడు వాళ్ల కుటుంబమంతా నన్నెంతో అబ్బురంగా చూసుకొన్నేరు. వాళ్లను జన్మజన్మలకు మరిసిపోలేను.**

కొండల్లో, కోనల్లో రెక్కారెక్కా రాసుకొంటా ఎగిరినాం. వాగుల్లో, వంకల్లో నీళ్ల జల్లుకొంటా మునకలేసినాం. పూల పొదల్లో ఎన్నో వూసులాడుకొంటిమి.

ఇసిక పరుపులమింద ఎన్నెల్లో జతకట్టి ఎన్నిసార్లు వొళ్లు మరిసినామో!

కన్నుమూసి, కన్ను తెరిసేంతలో కమ్మని కల కరిగిపూడిసింది. ఒగరోజు గాలివానా వచ్చింది. మేము వాలిన చెట్టు కూలింది. నేను పాణాలతో బయటపడినాను. కొమ్మల కింద నుజ్జునుజ్జయి కాకి పాణమిడిసింది. బొరోమని ఏడ్చినాను. సొర్గం అందినట్టే అంది నేలరాలిపోయింది.

కొన్నిదినాలు మనేదతో కుంగిపోయినాను. వొంటరి బతుకు ఎన్నాళ్లు బతికేది సచ్చిపోదామని తీరుమానం చేసుకొంటి.

అప్పుడే ఈ పసిగుడ్డు కడుపులో పడింది. మల్లాబతుకుమింద ఆశ కలిగింది. వొంటరిగా రెక్కలల్లార్చుకొంటా ఎగిరినాను, ఎగిరినాను, ఎగిరినాను, ఒగ దావంటూ లేకపాయనాకు.

"ముక్కోటికాడ ఈ సాదు చిలక తోడు పడింది. అది నన్ను మల్లా మీగుంపులోకి చేర్చింది. ఇది జరిగిన కత. కాకితో సావాసం చేసినందుకు కాకిపిల్ల పుట్టింది" అని కతంతా పూసగుచ్చినట్టు చెప్పింది పెంటిచిలక.

** ** **

పెంటి చిలక చెప్పిన కతను మిగతా చిలకలన్నీ చెవులు నిక్కబొడుచుకొని ఇన్నేయి.

"ఎంత కత నడిపినావే లంజదానా! నిన్ను నిలువునా నరికినా పాపంలేదు" కాకరించి మొగాన వూంచింది. కొటారిస్తాకాళ్లను ఇదిలించింది పోతు చిలక.

పెద్ద చిలక కుచ్చును కాలితో దీదుకొనింది.

"ఆయమ్మి చెప్పి కతంతా అందరూ ఇన్నేరు కదబ్బా? కాకితో సావాసం చేసి జతకూడినాని వొప్పుకొనింది. ఈడ చానామంది నాకంటే పెద్దోళ్లు, సదువుకున్నోళ్లు, లోకం తిరిగి నాలుగు వూర్లు చూసినోళ్లు వుండారు. వాళ్ల ముందు నేనెంత? మీరైతే ఏం చేస్తారో చెప్పండి" తెలివిగా ముందే అడ్డపుల్ల ఏసింది పెద్ద చిలక.

ఆడవుండే చిలకల్లో ఎవురికీ పెద్ద చిలక ముందర నోరు తెరిసే ధైర్నం లేదు. తెరి సినా పెద్ద చిలక పక్కనే మాట్లాడతాయి.

నడివయసులో వుండే చిలకొగటి పైకి లేసింది.

"దేవరా! మీరు రాజాతిరాజులు. అన్ని తెలువులూ వున్నోళ్లు. మీకు చెప్పాల్సిన పనిలేదు. ఈ పెంటి చిలక కాకితో జతకూడి మన చిలక జాతికే చెడ్డపేరు తెచ్చింది. కాకి కడజాతిది. సచ్చిన గొడ్లను పొడుసుకొని తింటింది. ఎద్దు వుండు కాకికి ముద్దగాదు. చిలకకు కాకి పిల్ల పుట్టిందని తెలిస్తే లోకం పకపకా నగితింది. కాకరించి వుమ్మేస్తింది. పొద్దుగూకతా, పొద్దు మొలస్తా వుండాదంటే, నెత్తి మింద ఆకాశం నేల రాలకుండా వుండాదంటే ధర్మం తప్పనందుకే! ఈ పొద్దు పెంటి చిలక దర్మాన్ని కాలతన్నింది. జన్మజన్మలకు గుర్తుండేట్టు పెద్దశిచ్చ ఎయ్యాల దేవరా! అని గొంతు చించుకొనింది.

"ఇదెక్కడి నాయం దేవరా? దర్మం నేనొక్కదాన్నే తప్పినానా? చిలకల ముడ్డి కింద ఎన్ని మచ్చలుండాయో ఒగసారి వొంగి చూసుకొంటే తెలిస్తింది. గోరువంకలతో జతకూడడం లేదా. అది తప్పుగాదా? నేను కాకితో జతకూడినప్పుడేనా ఆకాశం రాలి కిందపడతా వుండేది" గద్దించి అందర్నీ నిలదీసింది పెంటి చిలక.

చిలకల మొగాలు నల్లగా మాడిపోయినాయి. సదువుకొని తెలివిమీరిన చిలకొగటి పైకిలేసింది.

"దేవరా! శానా రాజ్జాలు తిరిగుండాను. ఎన్నో వింతలు, విశేషాలు చూసినాను, కాకితో చిలక జత కూడిన ఇచ్చిత్తరాన్ని ఇక్కడ్నే చూస్తావుండాను. మహామహా కవులే గోరింకలతో జతకూడినవైనాన్ని కైగట్టి వుండారు. చూడముచ్చటగా వుండే జంటను చిలకా గోరింకా అంటారుగాని, కాకి చిలకా అని పిలవరు, అది సృష్టికే విరుద్ధం. గోరింకలది ఉత్తమమైన జాతి. ఇవన్నీ మీకు తెలవకపోలేదు. మీ తీర్పు ఎటువంటిదైనా మేమందరం శిరసావహిస్తాం" పెంటి చిలకను తెలివిగా



## అవసరవేళల ఆదుకునే 'కిరణ్‌దేవి'

"ఇట్ ఈజ్ ఆల్వేస్ పాజిబుల్" (ఇది అన్నివేళలా సాధ్యమే)....

'అనుకున్నది ప్రతిదీ సాధిరచవచ్చు' - ఆమె మాటల్లో తరచు ధ్వనించే ఆత్మవిశ్వాసం. ఆమె పుస్తకాలు చెప్పే విషయం కూడా. రామన్‌మెగసెసే అవార్డు విజేత డాక్టర్ కిరణ్ బేడి జీవితతాత్వికత కూడా అదే. దేశంలోనే చాలా వివాదాస్పదమైన ఐ.పి.ఎస్ ఆఫీసర్‌గా పనిచేసినా, ఇప్పుడు కొత్తపోస్టింగ్‌లో(డి.జి.పి) చంఢీగడ్‌లో ఉన్నా ఆమె వ్యవహారశైలి సాహసోపేతంగానే సాగుతోంది. ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా సరే అక్కడికి వెళ్ళడం...పనిలో తనదైన ప్రత్యేక 'ముద్ర'ను ఆవిష్కరించడం కిరణ్ స్టయిల్. ఢిల్లీలో ట్రాఫిక్ విషయంలోనూ...తీహార్ జైలులోనూ ఆమె వ్యవహారశైలి అందరికీ తెలిసిందే. సామాజిక సేవాకార్యక్రమాలు కూడా చేపట్టడంలో ముందుంటుంది ఆమె. చాలామంది జీవితాల్లో ఆమె వెలుగులు నింపింది. ఆమె ద్వారా జీవితాల్లో వెలుగురేకలు చూసినవారు 'కిరణ్‌దేవి' అని గౌరవంగా పిలుచుకుంటారు. ఆమెలో ఒక శక్తిస్వరూపిణిని చూస్తారు. అన్నింటినీ మించి మానవత్వం నింపుకున్న మంచి అధికారిణిగా అభిమానిస్తారు. ఈ శతాబ్దంలో భారతీయమహిళల్లో గుణాత్మకమార్పులపై చర్చలు జరిగితే కచ్చితంగా డా.కిరణ్ బేడి పేరు ప్రస్తావించకతప్పదు. ●

